సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
బుధవారం | 26 జూన్ 2024 | పేజీలు 16

# ఎంపీ బైరెడ్డి శబరికి పీఎం ఆశీస్సులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ఆవరణంలోని ప్రధానమంత్రి కార్యాల యంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఎంపీ బైరెడ్డి శబరితో పాటు ఆమె భర్త డాక్టర్ శివచరణ్‌రెడ్డి, తండ్రి మాజీ ఎమ్మెల్యే మిగతా 2లో


ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి ఎంపీ బైరెడ్డి శబరి, బైరెడ్డి రాజశేఖర్, కుటుంబ సభ్యులు

# ప్రజల ప్రాణాలతో చెలగాటం


చిరుతపులి (ఫైల్‌ఫోటో)

- చిరుత పులి దాడిలో మహిళ మృతి
- చిరుతపులి సంచరిస్తున్నా అటవీ అధికారుల నిర్లక్ష్యం
- చర్యలు తీసుకోవడంలో అటవీ అధికారులు విఫలం


చిరుతపులి దాడిలో మృతి చెందిన మహిళ

**మహానంది, మేజర్‌న్యూస్ :** నంద్యాల-గిద్దలూరు రహదా రిలోని చలమ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరూన్ (47) చిరుతపులి దాడిలో మృతి చెందినట్లు గ్రామస్తులు, పోలీసులు తెలిపారు. మంగళవారం పచ్చర్ల గ్రామానికి చెందిన మెహరూన్ పుల్లల సేకరణకు అడవి లోకి వెళ్ళగా చిరుతపులి ఒక్కసారిగా దాడి చేసిందని, ఈ దాడిలో చిరుతపులి తలభాగంలో తీవ్రంగా గాయపరచగా ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మోహరూన్ గతంలో ఉప సర్పంచ్‌గా పని చేసిందన్నారు. ఈమె కుటుంబంపై దేవుడు చిన్న చూపు చూశారన్నారు. భర్త షేక్ హుసేన్ బాష ఆరు నెలల క్రితం గుండె పోటుతో మృతి చెందారన్నారు. కుమారుడు జీవనోపాధి కోసం పాలిష్ కటింగ్‌కు కర్నాటక రాష్ట్రానికి వెళ్ళగా అక్కడ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడన్నారు. కూతురికి వివాహం చేశారన్నారు.దీంతో ఒంటరిగా జీవిస్తున్న మహిళ ఉదయం నుంచి కనిపించకపోవడంతో బంధువులు, గ్రామస్తులు అడవిలోకి వెళ్లి పరిశీలించగా మృతి చెందిన పడి ఉండటాన్ని చూసి చిరుతపులి దాడి చేసినట్లు నిర్ధారించారన్నారు. మిగతా 2లో

# ఆళ్లగడ్డలో మహిళ దారుణ హత్య..

- భార్యాభర్తల పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి..
- టిడిపి తరపున ప్రచారం నిర్వహించిన అట్లా శ్రీదేవి
- కఠిన చర్యలు తీసుకోవాలన్న భూమా అఖిలప్రియ

2లో


మృతి చెందిన అట్లా శ్రీదేవి


గాయాలపాలైన అట్లా భాస్కర్‌రెడ్డి

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలో మంగళవారం రాత్రి సమయంలో పాతూరు వీధికి చెందిన తెదేపాకు చెందిన దంపతులు అట్లా శ్రీదేవి, అట్లా భాస్కర్ రెడ్డిలపై కొందరు గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. కళ్ళలో కారంపొడి చల్లి కత్తులతో దాడి చేసి నరకడంతో ఈ ఘటనలో అట్లా శ్రీదేవి (55) మృతి చెందగా ఆమె భర్త భాస్కర్ రెడ్డి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. అట్లా శ్రీదేవి ఇటీవలే ఎన్నికల్లో తెదేపా తరుపున భూమా అఖిలప్రియకు మద్దతుగా చురుకుగా ప్రచారం నిర్వహించారు. అట్లా కుటుంబంలో కొద్ది కాలంగా ఆస్తులకు సంబంధించి వివాదం నెలకొంది. అట్లా శ్రీదేవి మృతి చెందిన మిగతా 2లో

# గాజులదిన్నె ప్రాజెక్టులో అడుగంటుతున్న నీరు

- ప్రాజెక్టులో 11 టీఎంసీల (లైవ్) నీరు


2లో
గాజులదిన్నె ప్రాజెక్టులో నీరు తగ్గిన దృశ్యం

# శ్రీశైలం మల్లన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

- సీఎం చంద్రబాబు ఆసక్తితో వున్నారు ..ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి


2లో
సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం ఈఓ,ఎమ్మెల్యే బుడ్డా

## హాస్టళ్లు,రెసిడెన్షియల్ పాఠశాలల్లో

# నాణ్యమైన విద్యను అందించండి


2లో
సంక్షేమ హాస్టళ్ళ పనితీరుపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

# ఆదోని వైసీపీ కార్యాలయం పూర్తిగా అక్రమ కట్టడం


మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే

- అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదు..
- మున్సిపల్ అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారు..
- వైసీపీ పార్టీకి అధికారులు కోవర్టులుగా పని చేస్తున్నారు..
- ఎవ్వరిని వదలం..అందరి పై చర్యలు తీసుకుంటాం
- ఆదోని కూటమి ఎమ్మెల్యే పార్థసారధి

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని పట్టణంలోని ఏస్కేడి కాలనీలో నిర్మించిన వైసీపీ కార్యాలయం పూర్తిగా అక్రమంగా కట్టిందని కూటమి ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. మంగళవారం విలేకరులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఏస్కేడి కాలనీ 1వ రోడ్డులో ఉన్న ఎన్జీఓ ఎస్ ఉద్యోగుల సంఘానికి సంబంధించిన స్థలాన్ని వైసీపీ నాయకులు అక్రమంగా 99 సంవత్సరాల లీజును మిగతా 2లో

సూర్య

బుధవారం | 26 జూన్ 2024

# ప్రజల ప్రాణాలతో చెలగాటం

(మొదటి పేజీ తరువాయి)

**చిరుతపులి సంచారంపై అటవీ అధికారుల నిర్లక్ష్యం :** మహానంది మండల పరిధిలో, నంద్యాల, గిద్దలూరు రహదారిలో చిరుతపులి, ఎలుగుబంట్లు సంచరిస్తున్నా అటవీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై ప్రజలు తమదైన శైలిలో విమర్శిస్తున్నారు. గత ఆరు నెలల క్రితం పచ్చర్ల గ్రామ సమీపంలోని ఫారెస్ట్ టోల్ గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై చిరుతపులి దాడి చేసి గాయపరచినా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం, మహానంది పరిసర ప్రాంతాల్లో గత 15 రోజులుగా చిరుతపులి సంచరిస్తూ మూగ జీవులపై దాడి చేస్తున్నా అటవీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటీవల కాలంలో విద్యుత్ తీగెలకు తగిలి ఎలుగుబంటి మృతి చెందినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ప్రతినిత్యం వన్య ప్రాణుల సంరక్షణ పేరుతో వేలాది రూపాయలు టోల్ గేట్ల రూపంలో వసూలు చేస్తున్నారని, నంద్యాల జిల్లా పరిధిలో పచ్చర్ల, శ్రీశైలం, ప్రకాశం జిల్లా పరిధిలో దిగువమెట్ట, దోర్నాల, తెలంగాణ పరిధిలోని శ్రీశైలం వద్ద కూడా ప్రతినిత్యం టోల్ గేట్ల రూపంలో వసూలు చేస్తూనే ఉన్నారు. అయితే వాటి సంరక్షణ ఎక్కడ అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని కబుర్లు చెబుతున్న అధికారులు ధనార్జనే ధ్యేయంగా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారే తప్ప వన్యప్రాణుల సంరక్షణ మాట ఏమిటని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైందని ప్రజలు తమదైన శైలిలో విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజల ప్రాణాలను రక్షించాలని, అటవీని అనుకొని ఉన్న గ్రామాలు పురాతన కాలం నుంచి నివసిస్తున్న గ్రామాలేనని, నిర్లక్ష్యం వీడి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆళ్లగడ్డలో మహిళ దారుణ హత్య..

(మొదటి పేజీ తరువాయి)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

సమాచారం విన్న వెంటనే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భర్త భార్గవరామ్, తాలుకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి లు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి శ్రీదేవి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనకు కారుకులైన ఎంతటి వారినైనా ఉపేక్షించ వద్దని వెంటనే చర్యలు తీసుకోవాలని డి.ఎస్.పి షర్ఫుద్దీన్‌ను ఎమ్మెల్యే అఖిలప్రియ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తాను ఇప్పుడు ఏమీ మాట్లాడేది లేదన్నారు.

## గాజులదిన్నె ప్రాజెక్టులో అడుగంటుతున్న నీరు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు లో నీరు అడుగంటి పోవడంతో ప్రాజెక్టు వెలవెలపోతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.4 టీఎంసీ నీరు (లైవ్) మాత్రమే ఉంది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు ప్రాజెక్టు కింద 25వేల ఎకరాలు సాగు భూమి ఉంది. గత రెండేళ్లుగా జూన్ చివరి నాటికి ప్రాజెక్టులో వరద నీరు వచ్చి సంవృద్ధిగా చేరేది. ఈ ఏడాది జూన్ నెల చివరి తేది వచ్చినప్పటికి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలో వర్షాలు కురియక పోవడంతో ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరలేదు. దీంతో ప్రాజెక్టు వెలవెల పోతుంది. ఈ ప్రాజెక్టు కింద డోన్, పత్తికొండ, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు నీరు సరఫరా అవుతుంది. ప్రాజెక్టులో వరద నీరు వచ్చి చేరితేనే ప్రాజెక్టు కింద ఆయ కట్టు భూములు పంట సాగుతో కళకళలాడుతాయి. వర్షం కోసం రైతులు ఆశాశం వైపు ఎదురు చూస్తున్నారు.

# ఎంపీ బైరెడ్డి శబరికి పీఎం ఆశీస్సులు

(మొదటి పేజీ తరువాయి)

బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తల్లి బైరెడ్డి భారతమ్మ, చిన్నాన బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, చెల్లెలు బైరెడ్డి శర్వానిలు కలిసి ప్రధానితో కొద్దిసేపు ముచ్చటించి బైరెడ్డి కుటుంబం ప్రధానమంత్రితో గ్రూప్ ఫోటో తీసుకున్నారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ప్రధానమంత్రితో మాట్లాడుతూ నంద్యాల పార్లమెంట్ కు ఉన్న విశిష్టత, ఎంపీలుగా ఎంపికైన నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా, పీవీ నరసింహరావు ప్రధాన మంత్రిగా, పెండేకంటి వెంకటసుబ్బయ్య కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా చేసి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు తెచ్చారని వివరించగా శబరి కూడా ఆస్థాయిలో రాణించాలని ప్రధాని మోడీ డాక్టర్ శబరిని దీవించారు. తన సంపూర్ణ సహకారం నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు ఉంటుందని ఎంపీ బైరెడ్డి శబరికి నరేంద్రమోడీ భరోసా ఇచ్చారు.

## చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** వెల్దుర్తి పట్టణానికి చెందిన మానవపాటి సుబ్బారెడ్డి కుమారులు సుధీర్‌రెడ్డి, సుమన్‌కుమార్‌రెడ్డిల దోతి ఫంక్షన్‌కు పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. పట్టణానికి సమీపంలోని అమెజాన్ రిసార్ట్స్ నందు ఏర్పాటు చేసిన దోతి కార్యక్రమానికి కంగాటి శ్రీదేవమ్మతోపాటు, వైకాపా మండల కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డిలు హజరైయ్యారు.



# ఆదోని వైసీపీ కార్యాలయం పూర్తిగా అక్రమ కట్టడం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసుకొని భవనం నిర్మించడానికి కుట్ర పన్నారన్నారు. ఎన్జీఓ ఎస్ ఉద్యోగులు తమను ఇబ్బందులను పెట్టి తప్పుడు అగ్రిమెంట్ చేసు కొని స్థలాన్ని స్వాధీనం చేసుకొని మూడంతస్థుల ఫైవ్ స్టార్ హోటల్‌ను తలపించే భవనాన్ని ఏలాంటి అనుమతులు లేకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకొని నిర్మించారన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమీషనర్ రామచంద్రకు ఫోన్ చేసి వైసీపీ కార్యాలయ భవన నిర్మాణ వివరాలను ఇవ్వాలని కోరామన్నారు. అయితే కమీషనర్ కూడ తనను తప్పుదారి పట్టించారన్నారు. వైసీపీ భవనానికి సంబంధించి అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పుకొచ్చారన్నారు. అయితే మరో రెండు గంటల తరువాత కమీషనర్‌కు ఫోన్ చేసి బిల్డింగ్ నిర్మాణ పర్మిషన్లను మరోసారి చూసి చెప్పాలని కమీషనర్ ఆదేశించడంతో అప్పుడు అసలు విషయం బయటకొచ్చిందన్నారు. వైసీపీ కార్యాలయానికి ఏలాంటి అనుమతులు ఇవ్వలేదని కమీషనర్ వెల్లడించారని చెప్పారు. అయితే అధికారులు కూడ తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించారన్నారు. ఇప్పటికీ కూడ మున్సిపల్ కార్యాలయంలో వైసీపీ నాయకులకు కోవర్టులుగా పనిచేసేందుకు అధికారులు వ్యవహరిస్తున్నట్లు వారి దృష్టికి వచ్చిందన్నారు. అయితే నిర్లక్ష్యంగా వ్యవహరించిన అందరిపై శాఖపరమైన చర్యలకు సిఫార్సులు చేసి శిక్షార్హులు చేస్తానన్నారు. వైసీపీ కార్యాలయం అక్రమ నిర్మాణంపై చట్టం తన పని తాను చేసుకెళ్తుందన్నారు.



వైసీపీ కార్యాలయానికి నోటీసులు జారీ చేస్తున్న దృశ్యం

**వైసీపీ కార్యాలయానికి నోటీసులు జారీ : మున్సిపల్ కమీషనర్ :** అక్రమంగా నిర్మించిన వైసీపీ కార్యాలయానికి నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమీషనర్ రామచంద్ర తెలిపారు. అదేవిధంగా పట్టణ ప్రణాళిక అధికారులు నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, టిపిఓ, ప్లానింగ్ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. అదేవిధంగా వైసీపీ కార్యాలయం భవన నిర్మాణానికి అనుమతులు కోరుతూ, ప్లాన్ ద రఖాస్తు చేసిన ఎల్‌టిపిపై కూడ చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వైసీపీ కార్యాలయంపై భవిష్యత్తు చర్యలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# శ్రీశైలం మల్లన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

**శ్రీశైలం, మేజర్ న్యూస్ :** శ్రీశైల క్షేత్రాభివృద్ధి గురించి మంగళవారం రోజున స్థానిక శాసన సభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిపాలనా కార్యాలయభవనంలోని సమావేశమందిరంలో జరిగిన ఈ సమీక్షలో కార్యనిర్వాహణాధికారి డి. పెద్దిరాజు, ఉపకార్యనిర్వాహణాధికారిణి, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అన్నీ విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు తదితర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలక్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. క్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. శ్రీశైలక్షేత్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కి ప్రత్యేక దృష్టి ఉందని, తదనుగుణంగా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలాల నుండి కూడా భక్తులు అధికసంఖ్యలో క్షేత్రాన్ని సందర్శించడం జరుగుతోందన్నారు. భక్తులరద్దీకి అనుగుణంగా క్షేత్రంలో మౌలికసదుపాయాల కల్పన పట్ల ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ముఖ్యంగా భక్తులు క్యూ లైన్లలో అధిక సమయం వేచిఉండకుండా సులభతరంగా మరియు సంతృప్తికరంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా దేవస్థాన అతిథిగృహాలు, వసతిగదుల లోని సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలన్నారు. చెక్ లిస్టును రూపొందించుకుని ఎప్పటికప్పుడు గదులు, కాటేజీలలోని సదుపాయాల పట్ల ప్రత్యేకశ్రద్ధ కనబరచాలన్నారు. వారాంతపు సెలవురోజులలో, రద్దీరోజులలో క్షేత్రపరిధిలో ట్రాఫిక్ యిబ్బందులు ఏర్పడుతున్నాయని చెబుతూ, తగు ముందస్తు ప్రణాళికతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలియజేశారు. రాబోయే యాభైసంవత్సరాలను దృష్టిలో ఉంచుకొని బృహత్తర ప్రణాళిక ఉండాలన్నారు. బృహత్తర ప్రణాళికను కూలంకుషంగా అధ్యయనం చేసి తగుచర్యలు చేపడతామన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ సిబ్బంది అందరూ అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, భక్తులకు సేవలు అందించాలన్నారు. అన్ని విభాగాలు కూడా పరస్పర సమన్వయంతో క్షేత్రాభివృద్ధికి పాటుపడాలన్నారు. అదేవిధంగా ఆలయపాలనలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలన్నారు. క్షేత్రాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు మరియు పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. క్షేత్ర పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటాలన్నారు. కాగా సమీక్షా సమావేశంలో ముందుగా కార్యనిర్వాహణాధికారి డి.పెద్దిరాజు మాట్లాడుతూ దేవస్థాన కార్యకలాపాలను వివరించారు. సాధారణ రోజులు, వారాంతపు రోజులు, పర్వదినాలలో భక్తులరద్దీ, భక్తులకు కల్పించబడుతున్న వసతి, దర్శన ఏర్పాట్లు మొదలైన అంశాలను శాసనసభ్యులవారికి వివరించారు. తర్వాత శాసనసభ్యులు అన్నప్రసాదాల వితరణను పరిశీలించారు. అన్నప్రసాద వితరణ భవనంలోనే అన్నప్రసాదాలను స్వీకరించారు.

# హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించండి

– అధికారుల సమీక్షలో కలెక్టర్ శ్రీనివాసులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అత్యవసర మౌళిక సదుపాయాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సంక్షేమ హాస్టల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సంక్షేమ హాస్టళ్ల పనితీరు, విద్యార్థుల అడ్మిషన్, మౌళిక వసతులపై జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. డీఆర్వో పద్మ, అన్ని సంక్షేమ హాస్టళ్ల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లన్ని భర్తీ చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం తదితర వసతుల కల్పనలో అసౌకర్యం కల్పించకుండా అవకాశం ఉన్నంతవరకు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్ధేశించిన మెనూలో మార్పులు జరిగినా ఆహారం కలుషితమైన సంబంధిత వార్డెన్లను నేరుగా విధుల నుంచి తొలగింపుకు తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో 38 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 34 బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు, 13 ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లు, 46 కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఏడు అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, ఆరు జ్యోతిరావు పూలే పాఠశాలలు ఉన్నాయని వీటి పనితీరుపై ఇటీవల తహాశీల్దార్లతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సమస్యలు గుర్తించామన్నారు. గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉయ్యాలవాడలోని హాస్టళ్ళల్లో మరుగుదొడ్లు పనిచేయడం లేదని రన్నింగ్ వాటర్ సరఫరా కావడం లేదన్నారు. అన్ని సంక్షేమ వసతి గృహాల్లో తాత్కాలిక సౌకర్యాలకు పాఠశాలల నిర్వహణ నిధుల కింద ఖర్చు చేసి అవసరమైన మరమ్మతులు చేసి మూడు రోజుల్లో నివేదికలను పంపాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లన్నీ భర్తీ పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల ఆహార పదార్థాల సరఫరాకు సంబంధించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇండెట్ ప్రకారం అన్ని హాస్టళ్ళకు ప్రభుత్వం నిర్ధేశించిన ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మీదేవి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఫ్లోరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

# నెరవాటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో వృద్ధుడికి సహాయం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని గిరినాథ్ సెంటర్‌కు చెందిన లక్ష్మీనారాయణ అనే వృద్ధుడు చాలా కాలం క్రితం రోడ్డు ప్రమాదానికి గురై వివిధ ఆపరేషన్లు చేయించుకుని నడవడానికి, కనీస అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా విషయం రెడ్‌క్రాస్ దృష్టికి తేగా గాంధీచౌక్‌లోని నెరవాటి ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా దాదాపు రూ. 12వేలు విలువ చేసే కమోడు వీల్‌చైర్‌ను అందజేశారు. ఈసందర్భంగా నెరవాటి ఆసుపత్రి వైద్యులు వినోద్‌కుమార్, ప్రసూతి నిపుణురాలు డాక్టర్ అరుణకుమారిలు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు చాలా అద్భుతంగా నిర్వహిస్తున్నారని అందులో భాగస్వాములను చేయడం సంతోషకరమైన విషయమన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్, కోశాధికారి నాగేశ్వరరావు, సెవెన్‌హిల్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బోరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు రమేష్‌రావు, శ్రీనివాసులు పాల్గొన్నారు. డాక్టర్


నెరవాటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో వృద్ధుడికి కమోడ్ వీల్‌చైర్ ను అందజేస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ అరుణకుమారి

శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీనారాయణలు ప్రతినెల రూ. 2వేలు విలువ చేసే మందులను అందజేయడంలో భాగంగా వైద్యుల చేతుల మీదుగా ఉచితంగా మందులను అందజేశారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ మారుతికుమార్ ఉచితంగా ఫిజియోథెరపి చేయిస్తున్నారు.

# టిడిపితోనే బీసీలకు న్యాయం

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీతోనే బీసిలకు న్యాయం జరుగుతుందని, బీసిల అభ్యున్నతికోసమే ఆనాడు స్వర్గీయ నందమూరి తారకరామరావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని నంద్యాల జిల్లా బీసిసెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున అన్నారు. మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడిని అమరావతిలో కలిసి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందించారు.


మంత్రి అచ్చెన్నాయుడికి పుష్పగుచ్చం ఇస్తున్న బెస్త మల్లికార్జున

# బీరు సీసాలో ప్లాస్టిక్ స్పూన్


బీరు సీసాలో ఉన్న ప్లాస్టిక్ స్పూన్

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని బేతంచెర్ల రోడ్డులో గల ప్రభుత్వ మద్యం దుకాణంలో మంగళవారం కొండపేటకు చెందిన ఒక యువకుడు బీరు కొనుగోలు చేయగా అందులో ప్లాస్టిక్ స్పూన్ ఉండటంతో అవాక్కైయ్యారు. సదరు విషయాన్ని యువకుడు ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాడు.

# అక్రమ కేసులను ఎత్తివేయాలి


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ఉద్యోగ సంఘం నాయకులు సూర్యనారాయణపై ఉన్న అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు భంగి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో తమ హక్కులు అడిగితే అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. వెంటనే సజ్జల రామక్రిష్ణారెడ్డి, మాజీ సీఎస్ జవహర్‌రెడ్డిపై జ్యూడిషియల్ కమిషన్ ఏర్పాటు చసి వారిపై చర్యలు చేపట్టాలని, అక్రమ కేసులు బనాయించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యోగులతో కలిపి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఉచిత విద్య ఇవ్వాల్సిందే

**కర్నూలురూరల్, మేజర్‌న్యూస్:** ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య ఇవ్వాలని ఫోటో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయం గాంధీ విగ్రహం ముందు 60శాతం రాయితీ వద్దు 100శాతం రాయితీ ముద్దు అంటూ ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక చోట్ల జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అమలవుతుందని, కర్నూలులో ఉచిత విద్య అమలుకు కొందరు కావాలని అడ్డంకులు సృష్టించడం సిగ్గుచేటన్నారు. తప్పకుండా 100శాతం రాయితీ


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు చెన్నయ్య, రమేష్, ఎన్‌కె.మధు, మక్బుల్‌బాష, ఆసిఫ్, గంగాధర్, రామక్రిష్ణ, విష్ణు, రాజు, నరసింహ, రఫి పాల్గొన్నారు.

# 6 నుంచి 9వ తరగతులకు మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** మండలంలోని డా. బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల జూపాడుబంగ్లాలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు పాఠశాలలో మిగిలిన సీట్లకు భర్తీ కొరకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జూపాడుబంగ్లా అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు ఈ నెల 29వ తేదీన పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు విద్యార్థి ఆధార్ కార్డు, కుల ధృవీకరణ, రెండు ఫోటోలు తెచ్చి 28వ తేదీలోపు పాఠశాలలో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ నెల 29వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, అందులో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా వారికి సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

# పారిశ్రామిక పార్క్ కొరకు స్థలం పరిశీలన

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** పట్టణ సమీపంలోని కస్తూరిభా పాఠశాల సమీపంలో సర్వే నెంబర్-960లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని పారిశ్రామిక పార్క్ ఏర్పాటు కొరకు జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి ప్యాపిలి తహశిల్దార్ ప్రతాప్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటి తహశిల్దార్ మారుతీ, మండల సర్వేయర్ నాగరాజునాయక్, విఆర్ఓ, గ్రామ సర్వేయర్ తదితరులు ఉన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి, అధికారులు

# 12వ పీఆర్సీ ప్రకటించాలని నారాలోకేష్‌కే లేఖ

### - పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి అంగడిలోకేష్



**తుగ్గలి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల 12వ పీఆర్సీకి సంబంధించిన ఐఆర్‌ను ప్రకటించాలని, రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి నారాలోకేష్‌కు పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ లేఖ రాసినట్లు ఆ కమిటీ జిల్లా కార్యదర్శి అంగడి లోకేష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నారా లోకేష్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం రాష్ట్రానికి శుభపరిణామన్నారు. మంత్రి నారాలోకేష్ ద్వారా విద్యాశాఖ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్లు ఇవాలన్నారు.

# విద్యుత్ శాఖ సిబ్బందికి పరికరాల పంపిణీ

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని విద్యుత్ శాఖ సిబ్బందికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాశి నాగమహేశ్, కార్యదర్శి విజయశేఖర్, కోశాధికారి మామిళ్ళ నాగరాజు, కొత్త సుబ్బయ్య, రజనీకాంత్, మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయశేఖర్, తన సొంత నిధులతో విద్యుత్ శాఖ సిబ్బందికి పరికరాలు పంపిణీ చేశారు. మంగళవారం జరిగిన ఈకార్యక్రమానికి నంద్యాల జిల్లా టౌన్ ఎలక్ట్రిసిటీ ఏడీలు సతీష్‌కుమార్, రామయ్య, రవికుమార్, ఏఈలు శ్రీనివాసులు సమక్షంలో పట్టణంలోని అన్ని సెక్షన్లకు పనిచేసే లైన్‌మెన్‌లకు వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని జిల్లా ఆర్యవైశ్య సంఘం వారు జాగ్రత్తల కొరకు ఉచితంగా టోపీ, కటింగ్ ప్లేయర్, స్క్రూ డ్రైవర్, టెస్టర్ గల కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు మహేశ్ మాట్లాడుతూ త్వరలో విద్యుత్ శాఖ సిబ్బంది ఉద్యోగులకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు.



విద్యుత్ శాఖ సిబ్బందికి పరికరాలు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు భవనాశి నాగమహేశ్

## ఎంఆర్‌పియస్ మండల అధ్యక్షుడుగా సామెల్

### - నూతన ఎంఆర్‌పియస్ కమిటీ ఎన్నిక

**కోసిగి మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన కోసిగిలో ఎంఆర్‌పియస్ జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్, సుభాష్‌చంద్ర ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కోసిగిలోని యస్‌సి కమ్యూనిటి హాల్‌లో ఎంఆర్‌పియస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సామెల్, ఉపాధ్యక్షులుగా ప్రకాష్, ఈరన్న, అధికార ప్రతినిధిగా వందగల్లు నరసింహులుతోపాటు మరో కొంతమందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పియస్ నాయకులు చింతకుంట నాగరాజు, ఆంధ్రయ్య, మనోజ్, దుర్గప్ప, కోడి ఉరుకుందప్ప, ఈరన్న, తిమ్మయ్య, మూకయ్య పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన నూతన కమిటీ సభ్యులు


మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఇ.భారతీదేవి

## సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు అవసరం : డాక్టర్ ఇ.భారతీదేవి

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** వర్షకాలం ప్రారంభం అయినందున, ఈ కాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉండి, జాగ్రత్తలు తీసుకోవాలని హోమియో వైద్యాధికారిణీ డాక్టర్ ఇ.భారతీదేవి సూచించారు. మంగళవారం పట్టణంలోని 12వ వార్డు దాసరివీధి నందు హోమియో వైద్యాధికారిణీ డాక్టర్ ఇ.భారతీదేవి మహిళలకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, డయేరియాలు వ్యాపించకుండా కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలను బాగా ఉడికించి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి అరుణ, ఆశావర్కర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సూర్య

బుధవారం 26 జూన్ 2024

## సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీలకు వెల్దుర్తి విద్యార్థి ఎంపిక

వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ : ఈనెల 27వ తేది నుండి 30వ తేది వరకు చెన్నైలోని నెహ్రూ స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియంలో జరిగే సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీలకు వెల్దుర్తి పట్టణానికి చెందిన ఎరుకలి మహేష్ అనే విద్యార్థి ఎంపికైనట్లు ఏబి బాక్సింగ్ అకాడమీ కోచ్ జే.ఫయాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బాక్సింగ్‌లో పతకం సాధించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, కర్నూలు జిల్లాతోపాటు తాను పుట్టిన వెల్దుర్తి మండలానికి మంచి పేరు తీసుకొని రావాలని అభినందనలు తెలియజేశారు. గతంలో స్కూల్ గేమ్స్‌తోపాటు రాష్ట్ర స్థాయి గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం సౌత్‌జోన్‌కు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థి తండ్రి ఎరుకలి మద్దిలేటి మాట్లాడుతూ నా కుమారుడు ఈ స్థాయికి ఎదగడం చాలా సంతోషంగా, గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.



సౌత్ జోన్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ఎరుకలి మహేష్

## 29న జాతీయ లోక్‌అదాలత్

కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్: ఈ నెల 29వతేదీన కర్నూలు, నంద్యాల జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని, తమ తమ కేసులను రాజీపూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు.

## కేబినెట్ ఆమోదంపై హర్షం

కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు కేబినెట్‌లో ఆమోదం తెలపడంపై ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జిల్లా కమిటీ మంగళవారం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఐఏఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికాంత్‌ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాథ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం న్యాయవాదులకు ఇచ్చే స్టైఫండ్ పెంచాలని, న్యాయవాదులకు ఇండ్ల స్థలాల విషయంలో చొరవ చూపాలన్నారు.

## మహమ్మద్‌రఫీని బీసీ రామనాథ్ రెడ్డి పరామర్శ



మహమ్మద్ రఫీని పరామర్శిస్తున్న బీసీ రామనాథ్ రెడ్డి

బనగానపల్లె, మేజర్‌న్యూస్ : బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోని కోవెలకుంట్ల పట్టణం సంతపేటకు చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ సాయి తండ్రి గోనవరం మహమ్మద్ రఫిని బీసీ రామనాథ్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల మహమ్మద్ రఫికి కాలికి గాయమై నంద్యాల ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న రామనాథ్ రెడ్డి మహమ్మద్ రఫిని పరామర్శించి గాయం నయం అయ్యే వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

## గుల్‌బర్గా దర్గాలో మొక్కు తీర్చుకున్న రాయలసీమ సలాం

బనగానపల్లె, మేజర్‌న్యూస్: బనగానపల్లె తెలుగుదేశం పార్టీ ముస్లీం మైనార్టీ నాయకుడు రాయలసీమ సలాం గుల్‌బర్గా దర్గా నందు తన మొక్కును తీర్చుకోవడం జరిగింది. బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డికి మంత్రి పదవి దక్కడంతో రాయలసీమ సలాం కుటుంబ సమేతంగా గుల్‌బర్గా నందు మరియు ముంబై హాజిఅలీ దర్గా నందు తన మొక్కును తీర్చుకోవడం జరిగింది.



మొక్కును తీర్చుకుంటున్న సలాం

### రైతులు బయట విక్రయించకుండా

# రైతు బజారుల్లోనే విక్రయించాలి : జెసి

నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ : రైతు బజార్లలో ఏర్పడిన గుంతలను చదును చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం శ్రీనివాసనగర్, టెక్కె, గాంధీచౌక్‌లోని రైతు బజార్లను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసంద ర్భంగా జాయింట్ కలెక్టర్ రైతు బజార్లను పరిశీలిస్తూ ప్రతిరోజూ ఎంతమంది వస్తున్నారు కూరగాయలు, పండ్ల ధరలు ఎలా ఉన్నాయనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. బయటి ప్రాంతంలో రైతులు విక్రయించకుండా రైతుబజార్‌ల్లోనే కూరగాయలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని జేసి ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడి అబ్దుల్ రెహమాన్‌లు ఉన్నారు.



రైతు బజార్‌లో వ్యాపారుల నుంచి వివరాలు సేకరిస్తున్న జాయింట్ కలెక్టర్

# డిజిటల్ పేమెంట్స్ సేవల్లో ప్రపంచంలో భారత్ అగ్రగామి



కోడుమూరు, మేజర్‌న్యూస్: డిజిటల్ ఆర్థిక లావాదేవీలను అందించడంలో ప్రపంచదేశాలలో కల్ల మన భారతదేశం అగ్రగామిగా నిలిచిందని కర్నూలు కెనరాబ్యాంకు మేనేజర్ ఆర్ ఎస్ రామచంద్రారావు,నాగలాపురం ఎస్ఐ ఎపి శ్రీనివాసులు అన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాపును మంగళవారం పెద్దపాడు గ్రామంలోని యస్సి హాస్టల్ లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు,శ్రీనివాసులు లు మాట్లాడుతూ ఆర్థక అక్షరాస్యతను నిర్మూలించాలన్నారు. బ్యాంకులల్లో అకౌంట్లు చేసుకోవాలని,వాటి ఉపయోగాలను,డబ్బులను ఎలా పొదుపు చేసుకోవాలని,ఆర్థికంగా ఎలా ఎదగాలి,ఉన్నత చదువులకోసం ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేసుకొని భవిశ్యత్తులో స్థిరపడే విషయాలను తెలియజేశారు. అదేవిదంగా ఆన్లైన్ లల్లో జరుగుతున్న సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ పేమెంట్స్, మరియు కేంద్ర పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపాడు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ రాజేష్ బాబు, ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు,వి అశోక్ కుమార్, అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ సుదాకర్ బాబు,సి అశోక్ కమార్ మెప్మా అధికారి, ఆర్బిఐ రిసోర్స్ పర్సన్ నబీరసూల్, ట్రేనర్స్, పులికొండ,రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

### యుటిఎఫ్ ఆడిట్ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి

డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని లేనిపక్షంలో ఉపాధ్యాయుల ఉనికికే ప్రమాదంలో పడబోతుందని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండల యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం చిన్నమల్కాపురం నందు యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలోని మల్కాపురం, వలసల, ఎర్రగుంట్ల, కమలాపురం, కన్నపుకుంట, ధర్మవరం, గోసానిపల్లె, చింతలపేట, కొచ్చెర్వు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 95 మంది ఉపాధ్యాయులతో యుటిఎఫ్ సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వదిలి వలస పోతున్నారని, గత ప్రభుత్వం చేసిన సంస్కరణల వలన ఈ గతి ఏర్పడిందని, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కలిసి విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే 117 జీవోను రద్దు చేయాలని కోరారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ ఏడాది కాకినాడలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తరలివచ్చి, ఆర్థిక సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం కమలాపురం నందు పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రవిచంద్ర పిహెచ్‌డి పూర్తి చేసి పట్టా సంపాదించిన సందర్భంగా ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బివై.సుబ్బరాయుడు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, జన విజ్ఞానవేదిక ప్రధాన కార్యదర్శి మాణిక్యాలశెట్టి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మినాయక్, ట్రెజరర్ సుమన్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులచే సభ్యత్వ నమోదు చేయిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# తాగునీటి మోటర్ దొంగతనం

- తాగునీటి మోటర్లను టార్గెట్ చేస్తున్న దొంగలు
- కోసిగిలో తాగునీటికి ఆటంకం కలిగిస్తున్న దొంగలు
- దొంగలను పట్టుకోవాలంటూ సర్పంచ్ పోలీసులకు మొర

కోసిగి, మేజర్‌న్యూస్: అంగట్లోను, పొలాల్లోను, బ్యాంకుల్లో ఇలా దొంగతనానికి పాల్పడుతున్న దొంగలు కొత్తగా తాగునీటి మోటర్‌లను, వైర్లను దొంగతనానికి పాల్పడుతున్న సంఘటనలు కోసిగి గ్రామంలో చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా తాగునీటి బోర్లను, మోటర్లను టార్గెట్ చేసుకొని దొంగతనానికి పాల్పడుతున్నట్లు సర్పంచ్, పంచాయితీ అధికారులు ఆరోపిస్తున్నారు. గత నెలక్రితం పులికనుమ ప్రాజెక్టు సమీపంలో దాదాపుగా వేలాది రూపాయలు విలువచేసే తాగునీటి మోటర్ల వైర్లను దొంగతనం చేయడం జరిగిందని పంచాయితీ కార్యదర్శి తిరుమలేష్‌రెడ్డి తెలిపారు. ఆ దొంగతనం జరిపి నెలలు కాకముందే బుగినిచెరువు సమీపంలో ఉన్న విద్యుత్ మోటర్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు పంచాయితీ కార్యదర్శి తెలిపారు. ఇప్పటికే కోసిగిలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇలా విద్యుత్ మోటర్లను, వైర్లను దొంగలించి ఇటు గ్రామస్తులకు, అధికారులకు తలనొప్పిగా మారిందన్నారు. ఈ దొంగతనాలపై పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇలాంటి అల్లరి మూకలపై ప్రత్యేక నిఘాపెట్టి చట్టపరమైన చర్యలుతీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు పంచాయితీ కార్యదర్శి తెలిపారు.



దొంగలు దొంగలించిన విద్యుత్ మోటార్

# రైతులకు రాయితీతో కంది విత్తనాలు పంపిణీ


ఆలూరులో విత్తనాలను పంపిణబు చేస్తున్న ఏడిఏ సునీత


కంది విత్తనాలను అందిస్తున్న సర్పంచ్ మల్లికార్జున

**ఆలూరు, హాలహర్వి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సమస్యలకోసం కృషి చేసింది.అందులో భాగంగా మంగళవారం ఆలూరు వ్యవసాయ సంచాలకులు సునీత ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారులు వెంకటేష్‌గౌడు, శివశంకర్‌ల ఆద్వర్యంలో ఆలూరు,హాలహర్వి రైతులకు కంది, వేరుశనగ,కొర్ర విత్తనాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం 40 నుండి 60 శాతం సబ్సిడితో ఆయా పంటల విత్తనాలను అందిస్తుందని రైతులు ముందుగా వ్యవసాయ కార్యాలయంలో లేక ఆర్‌బికె కేంద్రాలలో విత్తనాల కోసం రిజిష్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు.రైతుల కోరిక మేరకు ఆలూరు మండలానికి 4క్వింటాళ్ల కంది విత్తనాలు,వేరుశనగ,కొర్ర విత్తనాలను పంపిణీ చేశామని కంది విత్తనాలను రైతులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని అన్నారు. రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించి పంటలు సాగు చేసుకోవాలని భూములు బాగా తేమగా ఉన్నప్పుడే విత్తనం వేయాలని అన్నారు.ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉండవచ్చని కావున రైతులు వర్షాధార పంటలను సాగు చేసుకోవాలని అలాగే పంటమార్పిడి చేసుకోవాలని వారు సూచించారు. అనంతరం ఆలూరు, హాలహర్వి ఆర్‌బికె కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు రాయితీతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున, శ్రీధర్, నాగరాజు, బద్రిలు పాల్గొన్నారు.

# రామకృష్ణ డిగ్రీ కళాశాలలో రెండవరోజు కొనసాగిన వర్క్‌షాప్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో కళాశాల చైర్మెన్ డా. జి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన రెండవరోజు మెండెలీ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ పల్లె సాధిక్‌లు మాట్లాడుతూ మెండెలీ అనే సాఫ్ట్‌వేర్ పరిశోధనలో భాగమైన వాళ్ళకే కాకుండా సాధారణ అధ్యాపకుల కోసం చాలా విలువైన సాఫ్ట్‌వేర్‌గా అభివర్ణించారు. మెండెలీ వెబ్ సేవ ఆధారంగా మెండలీ సైట్‌లో మొదట వ్యక్తిగత ఖాతాను సృష్టించాలన్నారు. స్థానిక కంప్యూటర్ వైపు ఇది వర్డ్ ప్రాసెసర్ ప్లగ్ ఇన్ లేదా యాడ్ ఇన్, మరియు డెస్క్‌టాప్ అప్లికేషన్‌తో కలసి పని చేస్తుందన్నారు. కొత్త మెండెలీ రిఫరెన్స్ మేనేజర్‌లైబ్రరీ క్లౌడ్ ఆధారిత 7 సెప్టెంబర్ 2020న ఇది మునుపటి మెండెలీ వెబ్ లైబ్రరీని భర్తీ చేసింది. తాజా మార్పులు ఎప్పుడు క్లౌడ్‌లో సేవ్ చేయబడతాయన్నారు. అనేక పరికరాలలో సూచనలు అందుబాటులో ఉన్నాయన్నారు. అంతేకాకుండా వివిధ మెండలీ భాగాల మొక్క అవలోకనాన్ని అందిస్తుందని మరియు నిలిపి వేయబడిన మరియు ప్రస్తుత అనువర్తనాలను సరిపోల్చడానికి అనుమతిస్తుందన్నారు. కొత్త మెండెలీ రిఫరెన్స్ మేనేజర్ మెండెలీ సిట్ వర్డ్ యాడ్ ఇన్‌తో పని చేస్తుకందన్నారు. మెండెలీ సిట్ వర్డ్ యాడ్ఇన్ ఒక సౌండ్ అలోన్ ప్లగ్ ఇన్ , మెండెలీ రిఫరెన్స్ మేనేజర్ తేరవాల్సిన అవసరం లేకుండా లేదా ఇన్‌స్టాల్ చేయకుండానే నేరుగా వర్డ్‌తో ఉపయోగించుకోవచ్చునన్నారు.


అవగాహన కల్పిస్తున్న పల్లె సాధిక్

# రామోజీరావుకు భారతరత్న ఇవ్వాలి

## – బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** రామోజీరావుకు భారతరత్న ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. మంగళవారం నగరంలోని నరసింహారెడ్డినగర్‌లో నగరూరు రాఘవేంద్ర మినీ బ్యాంకెట్ హాల్‌లో ఈ నల 27న నిర్వహించే రామోజీరావు సంస్మరణ సభ కార్యక్రమ కరపత్రాలను ఫోటో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల అధినేత కెవిసుబ్బారెడ్డి మాట్లాడుతూ రామోజీరావు జర్నలిజానికి మంచి పేరు తీసుకవచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జనచైతన్య సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషఫణి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళినాయుడు, గోపాల్, శివయ్య పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా

## – మున్సిపల్ ఛైర్ పర్సన్ పై జరిగిన ఘటన అమానుషం

## – మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడకూడదని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన స్వగృహంలో కార్యకర్తలతో వివిధ విషయాలపై చర్చించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, అదే స్ఫూర్తితో ముందుకు వెళ్తామన్నారు. నంద్యాల నియోజకవర్గ పరిధిలో శిలాఫలకాలు విధ్వంసం చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాలలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలన్నారు. అలాగే ఇటీవల స్థానిక 29వ వార్డు సచివాలయంలో మైనార్టీ వర్గానికి చెందిన నంద్యాల మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్ని సా పై జరిగిన దౌర్జన్యం ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. మైనార్టీ మహిళపై తెలుగుదేశం పార్టీ నాయకులు అమానూషంగా ప్రవర్తించడం దారుణమన్నారు. పోలీసు అధికారులను కలసి ఇటీవల జరిగిన పరిణామాలపై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలపై ఆయన కార్యకర్తలతో చర్చించారు. నంద్యాల, గోస్పాడు మండలాల, పట్టణ కార్యకర్తలు, వైసీపీ నాయకులు శిల్పా రవిని కలిశారు.


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి


సుందూరు కుమారస్వామికి ప్రత్యేక పూజలుచేసిన ఎంఎల్‌ఏ విరుపాక్షి

## ఆలూరు ఎంఎల్‌ఏ విరుపాక్షి కర్నాటకలో కుమారస్వామి, ఉలిగమ్మవ్వకు

# ప్రత్యేక పూజలు

**చిప్పగిరి, మేజర్‌న్యూస్:** ఆలూరు ఎంఎల్‌ఏ బుసినే విరుపాక్షి కర్నాటక రాష్ట్రంలోని సుండూరు,కొప్పల్ జిల్లాలోని ఉలిగమ్మవ్వలకు ప్రత్యేక పూజలు చేశారు.మంగళవారం బళ్లారిజిల్లాలోని సుండూరు కుమారస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉలిగమ్మ అవ్వ దేవాలయంనకు చేరుకొని అమ్మవారికి కూడా ప్రత్యేక పూజలు చేశారు.తన గెలుపుకోసం వైసిపి అభిమానులు, కార్యకర్తలు ఎందరో దేవతలకు మొక్కున్నారని అందరి ఆశీర్వాదాలతో ఆలూరు ఎంఎల్‌ఏగా గెలిచానని అన్నారు.తనపై అమ్మవారి అశీస్సులు చల్లగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, నాగప్ప, లోకనాధ్, ఓబులేసు, మల్లికార్జునలు పాల్గొన్నారు.

## 29వ జాతీయ లోక్ అదాలత్‌ను

# విజయవంతం చేద్దాం: పత్తికొండ జడ్జి భారతి

**పత్తికొండటౌన్, మేజర్‌న్యూస్ :** మండల న్యాయ సేవాధికార సంస్థ (లోక్ ఆదాలత్) ఆధ్వర్యంలో ఈనెల 29న జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భారతి పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణంలోని కోర్టు ఆవరణంలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయ లోక్ ఆదాలత్‌పై న్యాయవాదులు, పోలీసులతో జడ్జి ఎంఎస్ భారతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, పత్తికొండ కోర్టులో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అందువలన పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులను ఒప్పించి న్యాయవాదులు, పోలీసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. ఈనెల 29న లోక్ ఆదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మైరాముడు, ఈరన్న, సత్యనారాయణ, మల్లికార్జున, మహేష్, రమేష్, నరసింహాచారి, కృష్ణ, దామోదరచారి, డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పత్తికొండ టౌన్ రూరల్ సిఐలు మురళీమోహన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్.ఐలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి

# ఎరువుల దుకాణాలను ఎ.ఒ తనిఖీ


రిజిష్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎ.వొ అబ్దుల్ హక్

**అవుకు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన అవుకులో శ్రీనివాస ఏజెన్సీస్ మరియు ఎమ్.సి.ఎస నరసింహులు ఫెర్టిలైజర్ మరియు ఫెస్టిసైడ్స్ ఎరువుల దుకాణ ములను మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్స్ మరియు బిల్ బుక్స్ పరిశీలించి రైతులకు అందరికి బిల్లులు తప్ప కుండా అందజేయాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం వారు నిషేధించిన బయోఫెస్టిసైడ్స్‌ను పరిశీలించారు. కావున దుకాణాల యజమానులు బయోఫెస్టిసైడ్స్‌ను నిల్వ ఉంచడం కానీ అమ్మకాలు జరపడం కానీ చేయరాదని ఒకవేళ బయోఫెస్టిసైడ్స్‌ను నిల్వ ఉంచడం కానీ చేసినచో దుకాణం లైసెన్సును రద్దు చేస్తూ దుకాణాల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు.

## అంటువ్యాధులు రాకుండా

# గ్రామ పారిశుధ్యాన్ని పరిరక్షించడంలో కృషి

**అవుకు, మేజర్‌న్యూస్:** గ్రామంలో సీజనల్ వ్యాధులు అంటు వ్యాధులు రాకుండా గ్రామ పారిశుధ్యంపై దృష్టి సారించినట్లు గ్రామ పంచాయితీ కార్యనిర్వహణ అధికారి అశ్వనీకుమార్ తెలిపారు. ఆయన మంగళవారం సచివాలయ సిబ్బంది ఎ.ఎన్.ఎంలు ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి గ్రామం అంతటా పర్యటించి గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి అంతేకాకుండా గ్రామస్థులకు పారిశుధ్యాన్ని గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అంటు వ్యాధులు రాకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

సూర్య

బుధవారం | 26 జూన్ 2024

# డయేరియా పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి


పలుశాఖల అధికారు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ప్రస్తుతం వర్షాకాలంలో డయేరియా వ్యాధిసోకుతుందని అందుకు గాను ఈ వ్యాధి పట్ల ప్రజలలో అవగాహన కల్పించాలని ఎంపీడీవో సోనిబాయి, ఈవోఆర్డి నాగేష్, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, కోరారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశ భవనం నుందు పంచాయతీ కార్యదర్శులు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, పలు శాఖల సిబ్బందిలో సమావేశం నిర్వహించారు.ఆసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో డయేరియా వ్యాధి సోకకుండా ఉండేందుకు గాను శుభ్రమైన తాగనీరు వాడాలని గ్రామానికి తాగునీరు సరఫరా చేసే ట్యాంక్లను ఆ గ్రామ పంచాయతీ అధికారులు శుభ్రంచేయాలని కోరారు. అలాగే ఇండ్ల పరిసరాలలో ఈగలు, దోమలు ప్రభలకుండా ఉండేందుకు గాను మురికి నీటిని నిలువ చేసుకోరాదన్నారు. అంటువ్యాధులు ప్రభలకుండా ఉండేందుకు గాను పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సతీష్ తాటికొండ వెంకటేశ్వర్లు. బైలుప్పల వెంకటేశ్వర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# హైవే పనులు త్వరగా పూర్తి చేయాలి

**రైతులకు త్వరగా పరిహారం అందించాలి**
**చిన్న చిన్న సమస్యలను సరి చేసుకుంటూ వెళ్లాలి**
**జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి**

**పాములపాడు, మేజర్ న్యూస్ :** జాతీయ రహదారి 340 సి నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పాములపాడు మండల పరిధిలోని కిష్టరావుపేట తదితర గ్రామాలలో జాతీయ రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో ఎక్కడ కూడా పనులు ఆగకూడదని ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్లాలని అధికారులతో అన్నారు .కృష్ణరావుపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆంజనేయ స్వామి దేవాలయం మరికొన్ని ఇంటి సమస్యలను జెసి దృష్టికి తీసుకువచ్చారు. పరిహారం అందక ముందే పనులు ఎలా ప్రారంభిస్తారని చేసిన బాధితులు అడిగారు. అయితే త్వరగా బాధితులకు పరిహారం అందే విధంగా చూడాలని జాయింట్ కలెక్టర్ తహసీల్దార్ వెంకటరమణను ఆదేశించారు. అలాగే రుద్రవరం గ్రామంలో వీరస్వామి అనే రైతు ఇల్లు కూల్చి వేస్తే ఉండటానికి వేరే ఇల్లు లేదని 15 రోజులు సమయం ఇవ్వాలని కోరారు అంత సమయం ఉండదని నాలుగు ఐదు రోజుల్లో సమయం ఇచ్చి ఇల్లు తొలగించాలని ఆదేశించారు జెరుసలెంశాలను జెసి పరిశీలించారు జెరూసలెం తొలగించడాన్ని భక్తులు ఒప్పుకోకపోవడంతో రహదారి నిబంధనలను వారికి జెసి వివరించారు ఒక్కసారి రహదారి మ్యాప్ వచ్చిన తర్వాత దాన్ని మార్చడం కుదరదని అన్నారు పాములపాడు మండల కేంద్రంలోని


రహదారి పనులను పరిశీలిస్తున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

శ్రీ శారద విద్యానికేతన్ హై స్కూల్ స్థలంలో స్థలంలో అధికారులు తప్పుడు నిర్ణయాలతో ఇష్టానుసారంగా స్థలం సేకరించారని ఈ విషయంపై ఇప్పటికే కోర్టును ఆశ్రయించి స్టే కూడా వచ్చిందని జెసి దృష్టికి యజమానం తీసుకువెళ్ళింది డిఐఓ ఉమాపతి నిర్ణయమే ఫైనల్ అని మాట్లాడి తమకు శోభకు గురి చేశారని వాపోయారు. మరోసారి కొలతలు వేయాలని అలైన్మెంట్స్ ఫిక్స్ చేయాలని ఆదేశించారు ఉమాపతి ఎక్కడ పనిచేస్తున్నారనే సంగతి అడిగి తెలుసుకున్నారు ఎర్రగుడూరు గ్రామంలో నీళ్ల ట్యాంకు పోతుందని ప్రత్యామ్నాయం చూపాలని ప్రజలు అడిగారు ఎర్రగుడు గ్రామంలో చాలామందికి పరిహారం అందలేదని జెసికి ఫిర్యాదు చేశారు ఆయన వెంట ఎం హెచ్ ఏ ఐ పిడి గోవర్ధన్ గవి న్ల ఆర్డీవో దాసు ఎమ్మార్వో వెంకటరమణ డిటి పటాన్ బాబు సర్వేర్ భాస్కర్ ఎంఈఓ బాలాజీ నాయక్ ఎస్ఐలు అశోక్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠ్యపుస్తకాలు ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయాలని పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బాబు,జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ నాయుడు డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో ఎమ్మార్వో శేషారెడ్డికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా కూడా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయకుండా విద్యాధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిదంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్నం భోజనం పథకం సక్రమంగా అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో పి.డి.ఎస్.యు పట్టణ కార్యదర్శి నరసింహ రెడ్డి, నాయకులు రాజు,సన్నీ, నాయుడు, అగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడులోని ఏఎన్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు ఆత్మకూరు సిఐ నాగభూషణం ఎస్సై అశోక్లు సైబర్ మోసాలు మత్తుపదార్థాలకు బానిసలు అయిన వారి వీడియోలను విద్యార్థులకు చూపించి అవగాహన కలిగించారు. సమావేశం ఇందులో భాగంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కలలను విద్యాభ్యాసం ద్వారా కలలను సాకారం చేసుకోవాలని ద్వారా తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేరుస్తూ పేరు తెచ్చుకోవాలని మత్తుపదార్థాలు సైబర్ మోసాలకు అలవాటు పడి భవిష్యత్తును గ్రహ పాటుగా నాశనం చేసుకోవద్దని అన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఆరోగ్యాన్ని గుల్ల చేసుకోవడంతో పాటు కెరీర్ దెబ్బతింటుందని అన్నారు.తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పిల్లలను మంచిగా చదువు నేర్పించాలని, ఉద్యోగాలు సంపాదించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షతో ఉంటారని అన్నారు. సెల్ ఫోన్ వినియోగిస్తూ సైబర్ మోసాలకు గురి కావద్దని తద్వారా ఆర్థిక నష్టాలతో ఇబ్బందులు పడతారని కేవలం చదువుపైనే దృష్టి పెడుతూ అలవాట్లు ఉన్న మార్చుకొని సుఖమైన జీవితం గడపాలని చదువుపై దృష్టి పెట్టాలని ఎస్ఐ అశోక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసిన తహశీల్దార్


మోడల్ స్కూల్లో పర్యటిస్తున్న అధికారులు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆళ్ళగడ్డ తహశీల్దార్ నజీర్ అహ్మద్ మోడల్ స్కూల్, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆదేశించిన భోజన సదుపాయం, పుస్తకాలు, విద్య బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. ఈ తనిఖీల లో ఆర్.ఐ ప్రసాదు, వీఆర్వో జయన్న , ప్రిన్సిపల్ రాజు, హాస్టల్ వార్డెన్ సుమలత పాల్గొన్నారు.

# తండ్రి జ్ఞాపకర్థం తనయుల అన్నదానం

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రి జ్ఞాపకర్తం తనయులు కుటుంబ సభ్యులుమంగళవారం అన్నదానం చేశారు. వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామానికి చెందిన వేణుగోపాల్ 2014 లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతి చెందిన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం కాల్వబుగ్గలోని సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు చిన్న నారాయణ లక్ష్మీదేవి భార్య సుమిత్ర పిల్లలు సందీప్ దీక్షిత శ్రీ పాల్గొన్నారు.


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

# మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ చేస్తున్న ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ,చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి తస్లీమా సుల్తానా తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు,గొడిగనూరు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ దోమలు కుట్టకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇళ్ల ముందు మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓలు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు,ఎంఎల్హెచ్పిలు మనీషా,వెంకటమ్మ,ఆరోగ్య కార్యకర్తలు సుభాషిణి, చెంచులక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# గెస్ట్ ఫ్యాకల్టి ధరఖాస్తుల ఆహ్వానం

**నంద్యాల నూనెపల్లె, మేజర్న్యూస్ :** దీబగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథమ్యాటిక్స్ సబ్జెక్టులో గెస్ట్ఫ్యాకల్టికి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధృవపత్రాలతో నేడు ఉదయం కళాశాల ప్రిన్సిపల్ను సంప్రదించాలని పేర్కొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా

**మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**

**పాణ్యం, మేజర్ న్యూస్ :** కార్యకర్తలకు అండగా ఉంటానని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపు, ఓటమి సర్వసాధారణము అన్నారు. ఓటమి గురించి ఎవరు అధర్యపడవద్దు అన్నారు. గెలిచినా, ఓడినా ప్రజలతోనే ఉంటాము, ప్రజల కోసమే పని చేస్తాము అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రభుత్వానికి నిలదీస్తాము అన్నారు. టిడిపి ప్రభుత్వంలో కార్యకర్తలు దౌర్జన్యాల పాల్పడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. తమ్మరాజు పల్లెల్లో శిలాఫల్కం పగలగొట్టడం చాలా బాధాకర విషయం అన్నారు. మీరు కూడా ఏదైనా మంచి పనులు చేసి శిలాఫలకాలు వేసుకోవాలన్నారు. మా ప్రభుత్వంలో ఎప్పుడు ఇలాంటిది జరగలేదన్నారు. ప్రభుత్వం దౌర్జన్యాల మీద కాకుండా, అభివృద్ధి మీద దృష్టి ఉంచి ప్రజలు మేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న

# శ్రీ కాత్యాయని మెడికల్ స్టోర్ యాజమాన్యం

**బనగానపల్లెరూరల్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలోని శ్రీ కాత్యాయని మెడికల్ స్టోర్ యాజమాన్యం మానవత్వాన్ని చాటుకుంది. బనగానపల్లెలో నివాసం ఉంటూ యూపిఎస్లో పనిచేసే మనోహర్రావు తల్లి గతంలో ప్రమాదంలో రెండు కాళ్లు పోగోట్టుకొని నడవలేని స్థితిలో ఉన్నందున కాత్యాయని మెడికల్ స్టోర్ శ్రీ మారుతీ కుమార్ (వైస్ ఛైర్మెన్ రెడ్క్రాస్ సొసైటీ) మరియు నాగార్జున రెడ్డి కలిసి బనగానపల్లె సర్కిల్ ఇన్స్పెక్టర్ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో వారికి వీల్ చైర్ను అందజేశారు.


వీల్చైర్ అందజేస్తున్న దృశ్యం

## ఈ నెల29వ తేదిన జిల్లా చదరంగం జట్టు ఎంపిక పోటీలు

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో 19 సంవత్సరాల లోపు బాల బాలికల నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక కోసం ముని నాగ లక్ష్మి స్మారక టోర్నమెంట్ బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాల ఓఎస్‌డి రాజేష్ సౌజన్యంతో నిర్వహిస్తున్నామని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్. జి. రవికృష్ణ ప్రధాన కార్యదర్శి జి.రామ సుబ్బారెడ్డి తెలిపారు. ఎంపికైన జట్లు నంద్యాలలోనే జూలైలో జరగబోయే రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో నంద్యాల జిల్లా తరపున పాల్గొంటారన్నారు. ఈనెల 26 వ తేదీ లోపు ఆసక్తి గల క్రీడాకారులు ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9010451585 ను సంప్రదించాలని కోరారు.

## యువత మత్తుకు దూరంగా ఉండాలి : డీఎస్పీ



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్ళగడ్డ తాలూకా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ షర్ఫుద్దీన్ హెచ్చరించారు. పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతున్నా యని , తాలుకాలో టీం లుగా ఏర్పడి మత్తు పదార్థాల పై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ తెలిపారు. మత్తు పదార్థాలనుఅమ్మిన, కొన్న సేవించిన తమకు సమాచారం అందించాల ని కోరారు. సమాచారమిచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రజ్ఞా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన వందరోజుల మత్తు పదార్థాల మాదగ ద్రావ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సీఐరమేష్ బాబు,ఎస్సై వెంకటరెడ్డి, ఫారెస్ట్ అధికారులు, రెవిన్యూ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హేమలత రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ హేమలత రెడ్డి

## డయేరియాపై జాగ్రత్త వహించండి..ఎంపీడీవో సరస్వతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

**పాములపాడు, మేజర్ న్యూస్ :** మండలంలో ఎక్కడైనా గాని దైర్య కేసులు నమోదు కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సరస్వతి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఒకరికొకరు సహకరించుకుంటూ గ్రామంలో ప్రతి ఒక్కరు పర్యటించాలన్నారు. శ్రమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు ట్యాంకులను వారానికోసారి శుభ్రపరచాలని గ్రామంలో పారిశుద్ధ్యం లోపించ కుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు తాగునీటి మరి ఇతర సమస్యలపై సర్పంచులు వారు డబ్బులు చెల్లించి బిల్లులు పెట్టుకోవాలని గ్రామాలలో అతిసార రబలి నట్టు అనుమానం వస్తే మాంసపు దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు గ్రామాలలో బ్లీచింగ్ ఫ్లవర్ తరలించాలని సర్పంచులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగలక్ష్మి ఎంఈఓ సుహాసిని సిఓఆర్డి శ్రీనివాసులు నాయుడు హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

## సీడ్స్ విత్తనాల దుకాణాలను వ్యవసాయ అధికారులు తనిఖీ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** పట్టణంలోని సీడ్స్ విత్తనాల షాపులను వ్యవసాయ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.. పట్టణంలోని శ్రీ రెడ్డి సీడ్స్, విష్ణుప్రియ సీడ్స్ తదితర దుకాణాలను ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ఏడిఏలు రామ మోహన్ రెడ్డి, సుధాకర్, తాహసిల్దార్ నజీర్ అహ్మద్, ఆళ్లగడ్డ వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డిలు తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా వారు దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా మంచి విత్తనాలను అందించడంతోపాటు వారికి రసీదులు ఇవ్వాలన్నారు..

## రక్తదానం ప్రాణ దానంతో సమానం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానం చేయడంతో సమానమని ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం లీడర్ హుస్సేన్ అన్నారు. నంద్యాలలోని ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న అబ్దుల్ గనీంకు ఆపరేషన్ అవసరం చేయాల్సి ఉండడంతో వైద్యులు బి పాజిటివ్ బ్లడ్ అవసరమని అబ్దుల్ గనీంకు కుటుంబ సభ్యులు సూచించారు. దీంతో విషయం తెలిసిన ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్ సభ్యులు జిలాన్ బాషాకు సమాచారం ఇచ్చారు. వెంటనే జిలాన్ బాష నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో రక్తదానం చేశారు. అనంతరం మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తదానం చేసిన జిలాన్ బిషాకు కృతజ్ఞతలు తెలిపారు. అవకాశమున్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని సూచించారు.

## బాచేపల్లి తాండాలో ఘనంగా ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**ధర్మాచరణమే మనిషికి ధైర్యాన్ని ప్రసాదిస్తుంది**



**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** ఆరాధనకు అలవాటు పడిన చిత్తము ఆవేదనకు దూరమవుతుందని, ఆవేదనను కల్పించే పరిస్థితులు ఆసన్నమైనపుడు ఎవరు శాంతిని కోల్పోకుండా ఉంటారో వారే ధైర్యవంతులని, ధర్మాచరణమే మనిషికి ధైర్యాన్ని ప్రసాదిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి ఆళ్ళగడ్డ మండలం, బాచేపల్లితాండా లోని శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరం నందు మంగళవారం వారు ధార్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు శ్రీమద్రామాయణంలోని కొన్ని ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్, శీల హరిదాస ఠాకూర్ దాస్, ఉపాధ్యాయులు తల్లం వెంకటేశ్వర్లు, ధర్మ ప్రచార మండలి సభ్యులు టి.వి. వీరాంజనేయరావు, సర్పంచ్ నరేంద్ర, పురోహితులు రఘునాథ శర్మ, పూజారి మూడే గోవింద స్వామి, ధర్మ ప్రచారకులు నరసింహ రావు, రాజా నాయక్, నరసింహ నాయక్, వెంకట నాయక్, సేవా నాయక్, బుక్యే ధనకా నాయక్, బుక్యే కృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో సీఆర్ఎంటీలకు వెయిటేజ్ కల్పించాలి

**- మంత్రి నారాలోకేష్కు వినతి పత్రం అందజేసిన సమగ్రశిక్షణా ఉద్యోగులు**

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ(ఉపాధ్యాయ ఉద్యోగ నియామాకాలు)లో సీఆర్ఎంటీ (సమగ్రశిక్షణా ఉద్యోగులు) లు గా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం వెలు టేజ్ కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ను కర్నూలు జిల్లా సీఆర్ఎంటీ నాయకులు సుంకన్న, పుల్లన్న, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు రామశేకర్, చంద్రశేకర్ కోరారు. మంగళవారం అమరావతిలో మంత్రి లోకేష్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత12ఏళ్లుగా విద్యాశాఖలో సీఆర్ఎంటీ, ఎంఐఎస్, డీటీపీ, పీటీఐ, ఐఈఆర్టీలుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా జీతాలు పెంచ పోయినప్పటికి పని చేస్తున్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం 2024లో ఇంటర్, డీఎడ్, డిగ్రీ, బీ,ఎడ్, టీఈటీ, బీపీఈడీ, ఎంపీఈడీ లో సమానంగా అర్హతలు ఉన్నా మాకు పరీక్షలలో వెయిటేజి కల్పించాలని కోరుతున్నామన్నారు. 2019లో స్పెషల్ డిఎస్సీ, నందు సమగ్రశిక్షణలో పనిచేసిన ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ టీచర్స్కు ఏవిధంగా అయితే ఐదు మార్కులు వెయిటేజి కల్పించారో అదేవిధంగా సచివాలయ ఉద్యోగులకు 15 మార్కులు వెయిటేజి కల్పిచారో, ప్రస్తుతం సమగ్రశిక్షణలో పనిచేస్తున్నమాకు డీఎస్సీలో 20మార్కులు వెయిటేజి కల్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి తగుచర్యలు తీసుకోని న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.


విద్యాశాఖ మంత్రి లోకేష్కు వినతి పత్రం అందజేస్తున్న (సమగ్రశిక్షణా ఉద్యోగులు) సీఆర్ఎంటీలు

## అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను పరిష్కరించండి

**మంత్రి లోకేశ్‌ను కోరిన ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ నాయకురాలు**

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్‌లోని అంగన్‌వాడి వర్కర్లకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం సచివాలయంలో మంత్రి నారాలోకేష్‌ను కలిసిన ఏపి అంగన్ వాడివర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ కోరారు. ఏపిలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి, మంత్రులకు శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడిల సమస్యల పరిష్కారానికి మంత్రులు నారా లోకేష్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిలు యూనియన్ నాయకులకు హామిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్.మంజుల, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.మల్లేశ్వరీలు పాల్గొన్నారు.


నారా లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకురాలు

## టిడిపి-వైసిపి వర్గీయుల మధ్య ఘర్షణ


దాడిలో గాయపడ్డ మహిళ..

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మిడుతూరుమండల పరిధిలోని పీరు సాహెబ్ పేట గ్రామంలో మంగళవారం సాయంత్రం పాత కక్షలతో మనసులో పెట్టుకొని టిడిపి వైసిపి ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే గత సంవత్సరంలో వినాయక చవితి విగ్రహం ఏర్పాటు విషయంలో ఫోటో తెచ్చిన తంటా,ఇరువర్గాలు ఘర్షణకు దారితీసాయి. అది మనసులో పెట్టుకుని ఒక వర్గం వారిని గ్రానైట్ పనికి పోయి వస్తుండగా టిడిపి వర్గం వారు వైసిపి వారిపై అంజి,కృష్ణ భార్యను విచక్షణ రహితంగా దాడి చేశారని ఫిర్యాదు చేశారు రెండు వర్గాలు ఘర్షణ పడగా ఇరు వర్గాలపై ఎస్సై జగన్మోహన్ కేసులు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వారిని మిడుతూరు ప్రభుత్వ తరలించి వైద్య చికిత్సలు పోలీసులు చేయించారు దాడికి పాల్పడిన వారిని పోలీస్ స్టేషన్ తరలించారుఅనంతరం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జగన్మోహన్ జూపాడుబంగ్లా ఎస్సై లక్ష్మీనారాయణ ముచ్చు మరి ఎస్ఐ జయశేఖర్ గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.0



## కల్వర్టు పనులను పరిశీలించిన ఆర్.అండ్.బి అధికారులు

**బనగానపల్లెరూరల్,న్యూస్:** బనగానపల్లె మండల పరిధిలోని యాగంటిపల్లె గ్రామంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి చొరవతో నిర్మిస్తున్న కల్వర్టు పనులను మంగళవారంనాడు ఆర్.అండ్.బి ఈ.ఈ ఎ.వి శ్రీధర్ రెడ్డి, డి.ఈ సునీల్ రెడ్డి, ఎ.ఈ హుసేన్‌లు పరిశీలించారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామ టీడీపీ నాయకులు బండి మౌళీశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఈ కల్వర్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎంతో కాలంగా వర్షపు నీరు , డ్రైనేజి నీరు ఆగి అటు వాహనదారులు, గ్రామస్థులు ఎంతో ఇబ్బంది గురయ్యేవారు త్వరలో వారి ఇబ్బందులు తీరనున్నాయి.

# నేషనల్ హైవే పనులను అడ్డుకోవద్దు

## – జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



పెట్రోల్‌బంక్ యజమానులతో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి జరుగుతున్న ఎన్‌హెచ్ 340సి పనులను ఎవరూ అడ్డుకోవద్దని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం జూపాడుబంగ్లా మండల పరిధిలోని తర్తూరు గ్రామ సర్వే నెంబర్ 14బిలో ఎన్‌హెచ్ 340 సి రహదారికి ఎస్‌ఆర్ పెట్రోల్ బంక్ ఉన్నందున బంక్ యజమానులు పెట్రోల్ బంక్‌ను తొలగించడానికి నిరాకరించారు. మంగళవారం ఆయన బంక్ యజమానులను పిలిపించి జాతీయ రహదారి పనులు అడ్డుకోవడం సరైంది కాదని, మీకు ఏదైనా కావాలంటే మా దృష్టికి తీసుకొని రావాలని, లేకపోతే జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవాలని పెట్రోల్ బంక్ యజమానులకు తెలిపారు. ఎన్‌హెచ్ 340 సి రహదారిలో పెట్రోల్ బంక్ ఎంత వరకు పోతుందో అంత వరకు తొలగించి పనులు కొనసాగించాలని ప్రాజెక్టు డైరెక్టర్‌కు తెలిపారు. అలాగే మండ్లెం గ్రామంలోని సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు 340సిలో పోతున్నాయని అధికారులు జెసికి తెలియజేయగా వాటిని కూడా తొలగించి జాతీయ రహదారి పనులు కొనసాగించాలని మండల తహశీల్దార్‌కు సూచించారు. అంగన్‌వాడీ, సచివాలయాన్ని తొలగించే విషయం మండ్లెం గ్రామంలో దండోరా ద్వారా గ్రామస్తులకు తెలియజేయాలని తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్‌కు ఆదేశించారు. జెసితోపాటు ఆత్మకూరు ఆర్డీవో దాసు, డిటి నాగన్న, ఆర్‌ఐ రంగారెడ్డి, వీఆర్వోలు బాలకృష్ణ ఈశ్వరయ్య, సర్వేయర్లు కుమార్, శివలు ఉన్నారు.

# జగన్‌రెడ్డి ప్రభుత్వం కేసులు నమోదు చేయాలి

## – టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో ప్రజల ఆస్తులు స్వాహా చేసిన మాజీ సీఎం జగన్‌రెడ్డికి యావజ్జీవ శిక్ష పడేలా ప్రభుత్వం కేసులు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్‌తో కలిసి విలేఖరులతో మాట్లాడారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచేసి బెంగుళూరు, హైదరబాద్‌లలో ప్యాలెస్‌లు నిర్మించుకొని ఈడీ కేసుల్లో ఉన్న జగన్ తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అడ్డం పెట్టుకొని పార్టీ కార్యాలయాల పేరుతో ఎంతో విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసి అప్రూవల్ లేకుండానే భవనాలు నిర్మించారని ఆరోపించారు. 2024లో తానే అధికారంలోకి వస్తానన్న ధీమాతో ఇలా అక్రమాలకు పాల్పడి ప్రజలకు అన్యాయం చేశారన్నారు. జగన్ అవినతి, అక్రమాలపై ప్రభుత్వం నిగ్గు తేల్చాలన్నారు.

# రైల్వేస్టేషన్‌లో వృక్షాలను నరికేసిన కాంట్రాక్టర్లు

## – పట్టించుకోని రైల్వే అధికారులు





చెట్లను నరికేసిన దృశ్యం

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని రైల్వేస్టేషన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న వృక్షాలను కొందరు కాంట్రాక్టర్లు నరికేశారు. దీంతో రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులకు నీడ లేకుండా పోయింది. రైల్వేస్టేషన్‌లో ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న వృక్షాలను నరకవద్దని పలువురు ప్రయాణీకులు రైల్వే అధికారులను, కాంట్రాక్టర్లకు మొరపెట్టుకున్నా వారి మాటలను లెక్క చేయకుండా వృక్షాలను నరికి ఇత ప్రాంతాలకు తరలించారు. దాదాపు 20వృక్షాలను నరికేశారు. చెట్లను పెంచాల్సిన రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు వాటిని నరకం ఎంతవరకు సమంజసమని ప్రయాణీకులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే స్థానిక రైల్వే అధికారులపై రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## – ఆర్‌యూ వైస్ ఛాన్సలర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి సుధీర్‌ప్రేమ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అధ్యక్షతన సెబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందన్నారు. సెబ్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ మాదకద్రవ్యాలు తీసుకుంటే కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ నాగరాజు, రత్నం, విజయుడు, నాగచంద్ర, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## నందమూరినగర్‌లో

# కుళాయిలకు కలుషిత నీరు



కుళాయిల ద్వారా కలుషితమైన నీరు వస్తున్న దృశ్యం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణ శివారు ప్రాంతమైన నందమూరినగర్‌లో మంచినీటి కుళాయిలకు కలుషితమైన నీరు వస్తుంటే ఏ మాత్రం పట్టించుకోని మున్సిపల్ అధికారులకు సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ప్రజలు కలుషితమైన నీరు త్రాగి డయేరియాతో బాధపడుతున్నారన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని పాలకులు చెబుతున్న క్రింది స్థాయి అధికారులు ఏ మాత్రం ప్రజల ఆరోగ్యాలపై ప్రాణాలపై కొంచెం కూడా జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నారు. నాలుగైదు రోజులకు ఒక్కసారి అక్కడ పైపు లీక్ అయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులు లీక్ కాకుండా మంచినీటిని సరఫరా చేయాలని కోరారు.

# టీనా సేవలు ఎనలేనివి

## – జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి



పదవి విరమణ పొందిన టీనాను సత్కరిస్తున్న దృశ్యం

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** టీనా (పోలీసు జాగిలం) సేవలు ఎనలేనివని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ల్యాబ్ జాతికి చెందిన పోలీసు జాగితం టీనా పదవి విరమణ కార్యక్రమాన్ని జిల్లా సాయుధ రిజర్వు పోలీసులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పదవి విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 9 సంవత్సరాల 7 నెలలు ఉమ్మడి జిల్లాలో టీనా పోలీసు శాఖలో సేవలు అందించిందన్నారు. టీనాకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులతోపాటు విఐపి డ్యూటిలు, బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో టీనా సేవలు అందించిందన్నారు. టీనాకు శిక్షణ ఇచ్చిన ఏఆర్ కానిస్టేబుల్ సుంకిరెడ్డిని జిల్లా ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్ రిజిష్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- ఉన్నతాధికారులు కాలయాపనపై ఆంతర్యమేమి..?
- పాపపు సంపాదనలో జిల్లా అధికారుల పాత్ర కూడా ఉందా..?
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ



సబ్ రిజిష్టర్ కార్యాలయం



సీపీఎం రాధాకృష్ణ

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోనిసబ్‌రిజిష్టర్‌పై చర్యలు తీసుకోవడంలో జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.ఎస్‌రాధాకృష్ణ అన్నారు. మంగళవారం సూర్య మేజర్ న్యూస్‌తో ఆయన మాట్లాడుతూ, సబ్ రిజిష్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారి రాజశేఖర్ చేస్తున్న అవినీతిపై కళ్లకు కట్టినట్లు ఆధారాలతో సహా పత్రికల్లో ప్రచురణ అవుతున్నప్పటికీ ఉన్నతాధికారులు నిద్రపోతున్నారా అని ఘాటుగా స్పందించారు. అవినీతికి పాల్పడి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న అవినీతి అధికారిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనాన్ని ఎందుకు పాటిస్తున్నారని అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 40లక్షల చలానా చెల్లించకపోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. అధికారుల మౌనం తీరు చూస్తుంటే ఆదోని సబ్‌రిజిష్టర్ అక్రమ పాపపు సంపాదనలో జిల్లా అధికారుల పాత్ర కూడ అనుమానం లేకపోలేదన్నారు. జిల్లా అధికారులు నిజాయితీగా పనిచేసేవారైతే సబ్ రిజిష్టర్‌పై చర్యలు తీసుకొని ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. అలా కాకుండా యధావిధా తథా పదా అన్నవిధంగా అధికారుల తీరు కొనసాగిస్తే మోసపోయిన ప్రజల పక్షాన తాము నిలబడి పోరాటం చేసి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అవుతామన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు మౌనాన్ని వీడి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.